సాక్షి విజయనగరం

బుధవారం । 13 । నవంబర్ । 2024

● అన్నసంతర్పణ



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన భారీ అన్నప్రసాద సమర్పణ ఆలయం ఎదురుగా మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి నివేదన చేసిన ప్రసాదాన్ని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో, దాతలు సమక్షంలో భక్తులకు వడ్డించారు. సుమారు పదివేల మందికి పైగా భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు దంపతులు భాగస్వాములయ్యారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, స్వచ్ఛంద సేవకులు, వేలాదిగా హాజరైన భక్తులు అమ్మవారిని స్మరిస్తూ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు.

– విజయనగరం టౌన్

న్యూస్‌రీల్

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

నెల్లిమర్ల: గ్రామాల అభివృద్ధిలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు భాగస్వాములు కావాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి.సత్యనారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జీపీడీపీ 2024–25 వార్షిక ప్రణాళికకు సంబంధించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, కార్యదర్శులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలనే అంశాలపై శిక్షణ అధికారి ఎ.దేవుడు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ రామకృష్ణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శంకర్‌జగన్నాథ్, ఏఓ సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలను పరిశీలించిన వీసీఐ బృందం



కళాశాలలో పశువైద్య భవనాలను పరిశీలిస్తున్న వీసీఐ బృందం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలను వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృందం మంగళవారం పరిశీలించింది. పశువైద్య కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యాభ్యాసానికి వీసీఐ గుర్తింపు ఉంది. మూడు, నాలుగో సంవత్సరం చదువుకు గుర్తింపు ఇచ్చేందుకు అవసరమైన సదుపాయాలపై బృందం ఆరా తీసింది. కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో బృంద సభ్యులు వెస్ట్ బెంగాల్ పశువైద్య యూనివర్సిటీ ఫార్మర్ వైస్ చాన్సలర్, విశ్రాంత ప్రొఫెసర్ డా.తపన్‌కుమార్‌మండల్, మహారాష్ట్ర పశువైద్య యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.ఎ.పి.ధాక్, కేరళ మన్నుతీ పశువైద్య కళాశాల ప్రొఫెసర్ డా.వి.ఎస్.వాసుదేవన్ పశువైద్య కళాశాల నూతన భవనాన్ని, వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్సు పరిశీలించారు. ఫ్యాకల్టీ పూర్తిస్థాయిలో ఉన్నదీ లేనిదీ ఆరా తీశారు.

పదవీకాంక్షకు పరాకాష్ట!



చిత్రంలో టీడీపీ కండువా వేసుకున్న ఆమె పేరు ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాణి! గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తుపై ఎంపీటీసీగా గెలుపొందారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల మద్దతుతోనే శృంగవరపు కోట వైస్ ఎంపీపీ పదవి కూడా పొందారు. ఆ పదవిలో కొనసాగుతూనే సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ నాయకుడు నారా లోకేశ్ ఆమెకు పసుపు కండువా వేసి పార్టీ తీర్థం ఇచ్చారు. టీడీపీ నేతలు గొంప కృష్ణ, కోళ్ల లలితకుమారి అందుకు సాక్షులు. ఎన్నికల్లో టీడీపీ కోసం లలితకుమారితో కలిసే సుబ్బలక్ష్మి ప్రచారం కూడా చేశారు. అందుకు ప్రతిఫలంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఆమెకు నామినేటెడ్ పోస్టు కూడా కట్టబెట్టింది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ మద్దతుతో వచ్చిన వైస్ ఎంపీపీ పదవిలో కొనసాగుతూనే టీడీపీ కూటమి ప్రభుత్వంలో వచ్చిన నామినేటెడ్ పోస్టునూ అనుభవిస్తున్నారు.



టీడీపీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను దుశ్శాలువాతో ఇందుకూరి రఘురాజు ఇటీవల సన్మానిస్తున్న చిత్రం ఇది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దయతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి ఆయనకు దక్కింది. ఆ పదవిలో ఉంటూనే తెరవెనుక శృంగవరపుకోట నియోజకవర్గంలో టీడీపీ నేతలతో అంటకాగడం బహిరంగ రహస్యం. సార్వత్రిక ఎన్నికలకు ముందు కోళ్ల లలితకుమారి, గొంప కృష్ణ మధ్య అసెంబ్లీ టికెట్ పంచాయతీ కోసం టీడీపీ నాయకులతో కలిసి హైదరాబాద్ కూడా వెళ్లొచ్చారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోసం తెరవెనుక పనిచేయడమూ వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ విప్ పాలవలస విక్రాంత్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు ఆయనపై వేటువేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కానీ రఘురాజు మాత్రం తానింకా వైఎస్సార్‌సీపీలో ఉన్నానంటూ ఎమ్మెల్సీ పదవి కోసం న్యాయపోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు.

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో రఘురాజు దంపతుల విన్యాసాలు
- టీడీపీతో అంటకాగుతూనే వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ఎమ్మెల్సీ కోసం రఘురాజు ఆరాటం
- శాసనమండలి చైర్మన్ వేటువేసినా తాను వైఎస్సార్‌సీపీలోనే ఉన్నానంటూ వాదనలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీగా కొనసాగుతూనే టీడీపీలో చేరిన రఘురాజు భార్య
- టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పోస్టులో సుబ్బలక్ష్మి దర్జా
- తగిన బలం లేక ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు దూరంగా టీడీపీ కూటమి
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల మద్దతుతో ఇండిపెండెంట్‌గా సుబ్బలక్ష్మి నామినేషన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వైఎస్సార్‌సీపీకే రాజకీయ ద్రోహం చేసి, టీడీపీతో అంటకాగిన ఇందుకూరి రఘురాజు దంపతులు చివరకు ఎమ్మెల్సీ పదవి నానా విన్యాసాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీ చేయడానికి అవసరమైన సంఖ్యాబలం లేదని అధికార టీడీపీ కూటమి దూరంగా ఉంది. అదే సమయంలో తమ పార్టీ నాయకురాలైన ఇందుకూరి సుబ్బలక్ష్మిని బలపర్చలేదు. కనీసం ఆమె నామినేషన్‌పై ఏ ఒక్క టీడీపీ ఎంపీటీసీ సభ్యులు సంతకం కూడా చేయలేదు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులనే కొంత మందిని తమవైపునకు తిప్పుకొని సంతకాలు చేయించడం గమనార్హం. వాస్తవానికి ఇలాంటి రెండు పడవల వ్యవహారం వల్లే రఘురాజు సభ్యత్వంపై శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు వేటు వేయాల్సి వచ్చింది. తర్వాత న్యాయస్థానానికి వెళ్లి రఘురాజు కాస్త ఉపశమనం పొందినా స్థానిక సంస్థల కోటాలో విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక ప్రక్రియ మాత్రం ఆగలేదు. ఈ స్థానాన్ని భర్తీ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే అన్నీ జరుగుతున్నాయి.

ఇందుకూరి రఘురాజు ఒకవైపు వైఎస్సార్‌సీపీ ద్వారా పొందిన ఎమ్మెల్సీ పదవిని నిలబెట్టుకోవడానికి నానాపాట్లు పడుతుంటే ఇప్పుడు అదే ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఆయన భార్య ఇందుకూరి సుబ్బలక్ష్మి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచారు. తగిన సంఖ్యాబలం లేదని గ్రహించిన అధికార టీడీపీ కూటమి ఈ ఎన్నికలకు పూర్తిగా దూరంగా ఉంది. కానీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలిగా, ఆ పార్టీ ఇచ్చిన వైస్ ఎంపీపీ పదవిలో కొనసాగుతూనే అదే సమయంలో టీడీపీలో చేరి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ డైరెక్టర్ పోస్టునూ అనుభవిస్తూనే ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి కోసం నామినేషన్లు వేయడం గమనార్హం. ఆ నామినేషన్ల పత్రాలపై ఆమెకు మద్దతుగా సంతకం చేసిన పది మందీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులే. టీడీపీ ఎంపీటీసీలు ఒక్కరూ ఆమెకు మద్దతు ఇవ్వకపోవడం గమనార్హం.



ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ ఇలా...

నామినేషన్ల ఉపసంహరణ గడువు	:	నవంబర్ 14
పోలింగ్	:	నవంబర్ 28 (ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ)
ఓట్ల లెక్కింపు	:	డిసెంబర్ 1
ఎన్నికల ప్రక్రియ పూర్తి	:	డిసెంబర్ 2

తిరుగులేని వైఎస్సార్‌సీపీ...

ఉమ్మడి విజయనగరం జిల్లాలో శాసనమండలి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నామినేషన్ అర్హత పొందింది. అధికార టీడీపీ కూటమి నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా రఘురాజు భార్య సుబ్బలక్ష్మి, ఆయన అనుచరుడు వెంకటరావు వేర్వేరుగా వేసిన నామినేషన్లు కూడా స్క్రూటినీలో నిలిచాయి. ఈనెల 14వ తేదీ వరకూ నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. ఆ తర్వాత కూడా ఉపసంహరణ లేకపోతే ఉప ఎన్నిక అనివార్యమవుతుంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం నల్లేరుపై నడకే. మొత్తం 753 మందికి ఓటుహక్కు ఉండగా, వారిలో 592 మంది వైఎస్సార్‌సీపీ వారే. టీడీపీ బలం 122 కాగా, జనసేనకు ఒకటి మాత్రమే ఉంది. ఇండిపెండెంట్లు 15 మంది ఉన్నారు. మరణాల వల్ల 22 స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

మెరుగైన వైద్యంతో మాతృ, శిశు మరణాల నివారణ

- వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు అనిల్‌కుమార్



వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: సక్రమంగా పౌష్టికాహారం సరఫరాతో పాటు మెరుగైన వైద్యసేవలు అందజేసి మాతృ, శిశు మరణాల నివారించాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు డాక్టర్ అనిల్‌కుమార్ వైద్యులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతృ, శిశు మరణాలపై ఆరా తీశారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి ప్రసవమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ప్రసవ తేదీకి ముందే ఆస్పత్రిలో చేర్పించాలని, ప్రసవం అయ్యేవరకు వైద్యసిబ్బంది తోడుగా ఉండాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో శతశాతం వివరాలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. డయేరియా, జ్వరాల వ్యాప్తిపై ఇంటింటా సర్వేచేసి అవసరమైన వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

‘బెల్ట్’ తీయండి

- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్.బాజ్జీరావు



విజయనగరం, మన్యం జిల్లాల అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ బాజ్జీరావు

విజయనగరం క్రైమ్: మద్యం బెల్ట్ షాపులు నిర్వహించినా, వాటి నిర్వహణకు వేలంపాటలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాజ్జీరావు సబంధిత అధికారులకు సూచించారు. విజయనగరం బ్యాంక్ కాలనీలో ఉన్న కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎక్సైజ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ఎక్సైజ్ అధికారి బమ్మిడి శ్రీనాథుడు, డిపో మేనేజర్ గౌరీశ్వరరావు, రెండు జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

● కార్తీక ఏకాదశి పూజలు



కార్తీక ఏకాదశి పూజలను జిల్లా వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునుంచే ఆలయాలను దర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. సామూహిక సత్యన్నారాయణ వ్రతాలు జరిపారు. రాజాం ఆదర్శనగర్ కోదండరామాలయంలో సామూహిక సత్యన్నారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులను చిత్రంలో చూడొచ్చు.

– రాజాం సిటీ

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 14న బాలల దినోత్సవం, 15న మాదక ద్రవ్యాలపై అవగాహన-పుస్తక పఠన ప్రాముఖ్యతపై కార్యక్రమాలు, 16న గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులను స్మరించుకునే కార్యక్రమాలు, 17న కవి సమ్మేళనాలు, సెమినార్‌లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ, క్రీడా పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి తెలిపారు. 19న మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ డి.రమేష్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం కూటమిలో పదవుల చిచ్చు

- కొల్ల అప్పలనాయుడుకు పదవి ఇవ్వకపోవడంతో అనుచరవర్గం ఆగ్రహం

రాజాం: రాజాం నియోజకవర్గ కూటమిలో పదవుల చిచ్చురేగింది. సంతకవిటి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడుకు ఎలాంటి నామినేటెడ్ పదవి ఇవ్వకపోవడంపై ఆయన అనుచర వర్గం మండిపడింది. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన కొల్ల వర్గీయులు రాజాం పట్టణ కేంద్రంలోని నటరాజ్ కళ్యాణ మండపంలో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు పర్యాయాలు నామినేటెడ్ పోస్టులు కేటాయించినా కొల్ల అప్పలనాయుడు పేరును పరిగణనలోకి తీసుకోకపోవడంపై మండిపడ్డారు. 2014–19 మధ్య కాలంలో శ్రీకాకుళం జెడ్పీ చైర్మన్ పదవి ఇవ్వకుండా అడ్డుకున్నారని, ఆ తర్వాత ఎమ్మెల్సీ పదవిని ఊరించి ఉసూరుమనిపించారని ఆరోపించారు. నామినేటెడ్ పదవి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేయడం సబబుకాదన్నారు. కొల్లకు పదవి రాకుండా అడ్డుకుంటున్న సొంత పార్టీ నాయకులకు తామేమిటో చూపిస్తామని హెచ్చరించారు. సమావేశానికి టీడీపీ నాయకులు ఎం.నారాయణప్పడు, శ్రీనివాసచక్రర్తి, టి.సింహాచలం, శ్రీరాములు, వి.శ్రీనివాసరావు, గార ఉమామహేశ్వరరావు, రాజు, అప్పారావు హాజరయ్యారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్, ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్

విజయనగరం అర్బన్: స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికకు నామినేషన్ పత్రాలను ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్ ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్ మంగళవారం తన చాంబర్‌లో పరిశీలించారు. శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కె.వెంకటరావు, ఇ.సుబ్బలక్ష్మి నామినేషన్ పత్రాల్లో ఎటువంటి అభ్యంతరాలు లేనందున అర్హమైనవిగా ప్రకటించారు. అభ్యర్థుల వివరాలను నోటీస్ బోర్డులో పెడతామని జేసీ చెప్పారు. అభ్యర్థులకు విత్‌డ్రా కోసం ఫారం-5 అందజేస్తామని, 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపల విత్‌డ్రా ఫారం సమర్పించాల్సి ఉంటుందన్నారు. విత్‌డ్రా తర్వాత పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, ఎన్నికల విభాగం సిబ్బంది, అభ్యర్థుల తరఫున వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణే మన ‘సంకల్పం’

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి
- కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలు



ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించి, వాటి నియంత్రణే మన ‘సంకల్పం’ అని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘సంకల్పం’ కార్యక్రమ ఉద్దేశాలను ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు మంగళవారం వివరించారు. కొన్ని డ్రగ్స్‌ను న్యాయబద్ధంగా తయారుచేస్తూ.. వైద్యంలో వినియోగిస్తుంటే.. మరికొన్ని రకాల మత్తు కలిగించే గంజాయి, నల్లమందు పంటలను అక్రమంగా పండిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో పదివేల ఎకరాల్లో గంజాయి పంటను నాశనం చేసి 3 వేల మందిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగమన్నది ప్రతి ఒక్కరి సమస్యగా భావించి కట్టడి చేయాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇతరులకు పంపడం నేరమన్నారు. డిజిటల్ అరెస్టు, డిజిటల్ కోర్టు, ట్రాయ్, పార్సిల్స్, ఫెడెక్స్ కొరియర్ పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని, అటువంటి కాల్స్‌కు ఎవరూ స్పందించవద్దన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ అనేది సమాజానికి పెద్ద చాలెంజ్‌గా మారిందన్నారు. యువతలో చైతన్యం తీసుకువచ్చి, మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు ‘సంకల్పం’ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల మాట్లాడుతూ యువత భవిష్యత్ కోసం పోలీస్ శాఖ చేపట్టిన ‘సంకల్పం’ చాలా గొప్పదన్నారు. అనంతరం డీఐజీ గోపీనాథ్ జట్టి వైద్యకళాశాలకు డ్రగ్స్‌పట్ల అవగాహన కలిగిన కళాశాలగా ధ్రువపరుస్తూ సర్టిఫికెట్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు.

కళాశాలలో డ్రాప్‌ఇన్ బాక్సును ప్రారంభించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ డాక్టర్ బి.వెంకటరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ప్రభుత్వ సైక్రియాటిస్ట్ హెచ్‌ఓడీ డాక్టర్ మల్లిక, డీఎస్పీలు, సీఐలు, మెడికల్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.